విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 03, ఏప్రిల్ 2025

బుగ్గన శేషారెడ్డి పేరును తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - ప్యాపిలి : ప్యాపిలి పట్టణంలో నైపుణ్య అభివృద్ధి కేంద్రం బోర్డుపై మాజీ ఎమ్మెల్యే కీర్తిశేషులు బుగ్గన శేషారెడ్డి పేరును తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మాజీ మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, వైసిపి నాయకులు గజేంద్రనాథరెడ్డి ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. బుధవారం ప్యాపిలి పట్టణంలో వైసిపి నాయకులు శేషారెడ్డి పేరును తొలగింపుపై ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డోన్ నియోజకవర్గాన్ని మాజీ ఎమ్మెల్యే బుగ్గన శేషారెడ్డి పాలనలో ఎన్నోఅభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారని అటువంటి మహనీయుని పేరును తొలగించడం బాధాకరమని తక్షణమే తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని వారన్నారు. వైసీపీ నాయకులు మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, బోరెడ్డి కృష్ణారెడ్డి, బోరెడ్డి.పుల్లారెడ్డి, చిన్న పూజల రామచంద్రారెడ్డి,బోరెడ్డి రాము, బోరా మల్లికార్జున రెడ్డి, వైసిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ అంశాలపై దృష్టి సారించండి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : ఫ్రీ హెూల్డ్ భూములు, రీ సర్వే, 22ఏ, జాతీయ రహదారుల భూ సేకరణ తదితర రెవెన్యూకు సంబంధించిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి నాణ్యతతో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్‌తో కలిసి ఆర్డీఓలు, మండల తహశీల్దారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ఫ్రీ హెూల్డ్ భూములు, రీ సర్వే, 22ఏ, జాతీయ రహదారుల భూ సేకరణ తదితర రెవెన్యూకు సంబంధించిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి నాణ్యతతో పరిష్కరించాలన్నారు. ఫ్రీ హెూల్డ్ భూములకు సంబంధించి కొత్తగా వస్తున్న అసైన్మెంట్ పై ఉత్తమ విఆర్ఓలు, సర్వేయర్లు, సంబంధిత సిబ్బందితో జిల్లా, మండల స్థాయిలో వర్క్ షాప్స్ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీఓలను ఆదేశించారు. ఇంటిగ్రేటెడ్ రెన్యువబుల్ ప్రాజెక్ట్‌లకు సంబంధించి పెండింగ్ ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. నేషనల్ హైవే, రైల్వేకు సంబంధించి పెండింగ్‌లో భూ సేకరణ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో త్రాగునీటికి ఇబ్బందికి లేకుండా చూడాలన్నారు. కుసుమ్, కంప్రెస్సెడ్ బయో గ్యాస్ ప్లాంట్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న స్థల సేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ మండల తహశీల్దార్లను ఆదేశించారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పౌర సేవలను ప్రజలు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్ఓ రాము నాయక్, ఎఓ రవి కుమార్, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ అత్యవసర సమావేశం బాయ్‌కాట్

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : మున్సిపల్ అత్యవసర సమావేశం బుధవారం మున్సిపల్ ఛైర్ పర్సన్ మాబున్నిసా అధ్యక్షతన మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి నిర్వహించారు. అజెండాలో పొందుపరచిన 9 అంశాలపై చర్చించారు. రెండు అంశాలపై వైసీపీ, టిడిపి కౌన్సిలర్ల మధ్య ఉద్రిక్తత నెలకొంది. మిగతా వాటిని ఆమోదించారు. సీఎం చంద్రబాబు నాయుడు ఈనెల 19న నంద్యాలలో మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు నంద్యాలకు వస్తున్న సందర్భంలో మున్సిపల్ పరిధిలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు రూ.కోటి 42లక్షల 40 వేలు నిధులు సాధారణ నిధుల నుండి కేటాయింపు విషయంలో రూ.90 లక్షల వరకు ఖర్చుకు కౌన్సిల్ ఆమోదం తెలుపుతున్నట్లు చైర్మన్ ప్రకటించడంతో ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి కౌన్సిల్ తీసుకున్న నిర్ణయం మున్సిపల్ కౌన్సిల్‌కు సిగ్గుచేటు అని సాధారణ కౌన్సిల్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు తీసుకోవడం సబబు కాదని తెలుగుదేశం కౌన్సిలర్లు ఈ విషయాన్ని తీవ్రంగా ఖండించారు. తెలుగుదేశం కౌన్సిలర్లు ఖండే శ్యామ్ సుందర్ లాల్, మాబు వలి, నాగార్జున, జైనాబి, శ్రీదేవిలు సభ నుండి నిష్క్రమించిన తర్వాత కౌన్సిల్ సమావేశం యధావిధిగా కొనసాగింది. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి. డీఈలు, టౌన్ ప్లానింగ్ అధికారి నరసింహ మూర్తి, రిజ్వానా, ఆర్ఓ అంజనేయులు, శానిటేషన్ సూపరైజర్ మురళీధర్, లక్ష్మీనారాయణ, శివ ప్రసాద్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

శ్రీ చౌడేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న మంత్రి

విశాలాంధ్ర - బనగానపల్లె : మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన నందవరం శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారి జ్యోతి మహెూత్సవాలు సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ చౌడేశ్వరి అమ్మవారిని దర్శించుకున్నారు. మంత్రి సత్య కుమార్ యాదవ్ ఆలయం చేరుకోగానే ఆలయ పండితులు, ఆలయ ఈవో కామేశ్వరమ్మ ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి అమ్మవారికి కుంకుమార్చన ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితులు అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి నందవరం చేరుకోగానే బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి శివక్రిష్ణ యాదవ్, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బీవీ సుబ్బారెడ్డి, బిజెపి కార్యకర్తలు, శరత్ చంద్రకుమార్, లింగన్న హరి కృష్ణగౌడ్, యాదగిరి, రవికుమార్, లోకేశ్వర్ రెడ్డి ,చిన్నయ్య యాదవ్, బాల వెంకటేశ్వర్లు చల్లా దామోదర్ రెడ్డి, శ్రీరాములు తదితర నాయకులు కార్యకర్తలు కలిసి పుష్ప గుచ్ఛాలతో ఘన స్వాగతం పలికారు.

వక్ఫ్ బిల్లును నిరసిస్తూ నిరసన

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : వక్ఫ్ సవరణ బిల్‌కు వ్యతిరేకంగా ఎస్డీపిఐ ఆధ్వర్యంలో బుధవారం నంద్యాలలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. బిజెపి ప్రభుత్వం పార్లమెంటులో వక్ఫ్ సవరణ బిల్ ప్రవేశపెట్టడంతో వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా పట్టణంలోని గాంధీ చౌక్‌లో భారీ నిరసన చేపట్టారు. వక్ఫ్ సవరణ బిల్లుతో ముస్లింల హక్కులకు భంగం వాటిల్లుతుందని, ఈ బిల్లును తక్షణమే బిజెపి ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ కలాం మాట్లాడుతూ బిల్లును వెనక్కి తీసుకునే వరకు నిరసనలు కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు. నంద్యాల అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి కరిముల్లా మాట్లాడుతూ ఈ బిల్లు ముస్లిం వక్ఫ్ ఆస్తులపై ప్రభుత్వ నియంత్రణను పెంచేలా ఉంది. ఇది ముస్లిం సామాజిక, ఆర్థిక హక్కులకు గండికొడుతుంది. మేము దీన్ని వ్యతిరేకిస్తామని పేర్కొన్నారు. వక్ఫ్ సవరణ బిల్లుకు పార్లమెంటులో టిడిపి ఎంపీలు వ్యతిరేకంగా ఓటు వేయలన్నారు. ఉమెన్స్ ఇండియా మూవ్మెంట్ నాయకురాలు పూల జారీన మాట్లాడుతూ మహిళల హక్కులను పరిరక్షించడానికి, ముస్లింల స్వతంత్రతను కాపాడటానికి ఈ బిల్లును వ్యతిరేకించడం అనివార్యమని, మేము దీని కోసం నిరంతర పోరాటం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ నాయకులు ఫాజిల్ దేశాయ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఉమెన్స్ ఇండియా మూవ్మెంట్ నాయకులు, కార్యకర్తలు, ముస్లిం సంఘాల ప్రతినిధులు, ముస్లిం యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీశైలం దర్శనానికి రావాలంటూ పార్లమెంట్ స్పీకర్‌కు ఆహ్వానం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : ఢిల్లీలోని పార్లమెంట్ ఆవరణలో లోక్ సభ స్పీకర్ కార్యాలయంలో బుధవారం స్పీకర్ ఓం ప్రకాష్ బిర్లాను ఎంపీ, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి మర్యాద పూర్వకంగా కలిశారు. భూకైలాసంగా పిలువబడుతూ అష్టాదశ శక్తిపీఠం, జ్యోతిర్లింగ క్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీశైల పుణ్య క్షేత్రంకు కుటుంబ సమేతంగా వచ్చి శ్రీభ్రమరాంబ, మల్లికార్జున స్వామి వార్లను దర్శించుకోవాలని ఆహ్వానించారు. అనంతరం లోక్ సభ స్పీకర్ ఓం ప్రకాష్ బిర్లాకు శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్ల చిత్రపటం, లడ్డు ప్రసాదం ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అందజేశారు.

డ్రైనేజీ నిర్మాణ పనులు పరిశీలించిన మంత్రి

విశాలాంధ్ర - బనగానపల్లె : పట్టణంలో కొత్తగా నిర్మిస్తున్న డ్రైనేజీ నిర్మాణ పనులను బుధవారం రాష్ట్ర రోడ్లు , భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి స్వయంగా పరిశీలించారు. జర్రేరు వాగు సుందరీకరణ పనులు జరుగుతున్న తీరుపై మంత్రి అధికారులను ఆరా తీశారు.. జుర్రేరు వాగులోకి మురికి నీరు కలవకుండా, ప్రత్యామ్నాయంగా కొత్తగా పట్టణంలో నిర్మిస్తున్న ఈ డ్రైనేజీ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు మంత్రి సూచించారు. ఇటీవల కాలంలో జుర్రేరు వాగు సుందరీకరణ పనులు జరుగుతున్న క్రమంలో వారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తాము వాగు ప్రక్షాళనకు పూర్తి సహకారం అందిస్తామని.. అందుకు ప్రత్యామ్నాయంగా తమకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని మంత్రి దృష్టికి తీసుకురాగా అందుకు మంత్రి సానుకూలంగా స్పందించారు.పట్టణ అధ్యక్షుడు కాసింబాబు, అత్తర్ కలాం, మహబూబ్ బాషా, మురళీమోహన్ రెడ్డి, షబ్బీర్, విష్ణువర్ధన్ రెడ్డి, కార్పెంటర్లు పంచాయతీరాజ్ డిఇ నాగ శ్రీనివాసులు, పంచాయతీరాజ్ ఏఈ వెంకటరమణ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర - ఆత్మకు రూరల్ : అదనపు గృహ నిర్మాణ లబ్ధిదారులకు అదనపు సబ్సిడీ అందించడానికి ప్రభుత్వం నిర్ణయించింది. ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు 50,000, ఎస్టీలకు 75000, పివి జీటీలకు లక్ష రూపాయలు అదనపు సహాయం అందించనుందని గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ హరి గోపాల్ తెలిపారు. పట్టణం నందు మంజూరి అయిన లబ్ధిదారులు అందరూ వివిధ దశలో ఉన్న తమ ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకోవాలని, హౌసింగ్ నిర్మాణ ప్రాజెక్టు డైరెక్టర్ హరి గోపాలు , పట్టణ మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబులు డోర్‌టు డోర్ తిరిగి లబ్ధిదారులకు గృహ నిర్మాణాలు వచ్చే నెల మే - 31-2025 లోపల పూర్తి చేసుకోవాలని అవగాహన కల్పించారు అదేవిధంగా వార్డ్ అమినిటీస్ సెక్రటరీలకు మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఈ నాగరాజు, ఏఈ ఉమామహేశ్వర్ రెడ్డి, వర్క్ ఇన్స్పెక్టర్లు నాయక్, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి నిధులు వెచ్చించిన మంత్రి

విశాలాంధ్ర - బనగానపల్లె : యాగంటి ఉమామహేశ్వర స్వామి గర్భాలయంలో రెండు ఏసీల కొరకు రూ.4లక్షలు మరమ్మత్తుల కొరకు రూ.11లక్షలు తన సొంత నిధులు వెచ్చిస్తున్నట్లు రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. బుధవారం నాడు యాగంటి ఉమామహేశ్వర స్వామి ఆలయం చేరుకోగానే ఆలయ ఈవో బి.చంద్రుడు, ఉప సర్పంచ్ బండి మౌలిశ్వర్ రెడ్డి, ఆలయ పండితుల ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ పరిసరాలు కలియతిరిగి ఆలయనికి కావాల్సిన వసతుల గురించి ఆరా తీశారు. పాతపాడు సర్పంచ్ బెడుదల మహేశ్వర్ రెడ్డి, యువ నాయకులు శంకేశ్వర్ రెడ్డి, నారాయ ణరెడ్డి, ఆర్ సి నాగిరెడ్డి, రామ్ శేఖర్, చంద్రహాస్ రెడ్డి,తిరుమలయ్యలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేత

విశాలాంధ్ర - డోన్ రూరల్ : విద్యార్థుల నుంచి తీసుకున్న ట్యాబ్‌లను, మరలా తిరిగి విద్యార్థులకు ఉన్నతాధికారుల ఆదేశాలతో అందజేశామని అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపల్ ఏ.ఆర్.సుస్మిత తెలిపారు. బుధవారం పాఠశాల నందు విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేసే కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ చదువు పూర్తయి, ఇంటికి వెళ్లిన విద్యార్థులకు కూడా పాఠశాలకు పిలిచి ట్యాబ్‌లు అందజేస్తామని అన్నారు. విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పాఠశాల వద్దకు వచ్చి, ట్యాబ్ లను తీసుకెళ్లవచ్చని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

సెరికల్చర్ అసిస్టెంట్‌కు పదోన్నతి

విశాలాంధ్ర - వెలుగోడు : వెలుగోడు మండలం మోత్కూరు గ్రామ సెరికల్చర్ అసిస్టెంట్ నాగలింగం కు టెక్నికల్ అసిస్టెంట్‌గా పదోన్నతి వచ్చిందని మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ తెలిపారు. వారు మాట్లాడుతూ నంద్యాల జిల్లా సేరికల్చర్ కార్యాలయానికి టెక్నికల్ అసిస్టెంట్ గా పదోన్నతి పొందిన మోత్కూరు గ్రామ సెరికల్చర్ అసిస్టెంట్ స్థానంలో వ్యవసాయ విస్తరణ అధికారి అంజిత్ కుమార్ రెడ్డిని ఇన్చార్జిగా నియమించినట్లు వారు తెలిపారు. తదుపరి రైతు సేవ కేంద్రం సిబ్బంది అందరూ పదోన్నతి పొందిన నాగ లింగాంకి మొమెంటుతో సన్మానం చేసి అభినందించారు. వెలుగోడు మండలం వేల్పనూరు, వెలుగోడు రైతు సేవ కేంద్రాలను మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ పరిశీలించారు. వారు మాట్లాడుతూ మండలంలో 7595 మంది రైతులు ఉండగా కేవలం 4891 మంది రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేశారని తగిన రైతులకు వెంటనే రిజిస్ట్రేషన్ చేయాలని రైతు సేవా కేంద్ర సిబ్బందిని ఏవో ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ సిబ్బంది అంజిత్ కుమార్ రెడ్డి, మహేంద్ర యాదవ్, స్వర్ణ వెంకట శివ రామకృష్ణ పాల్గొన్నారు.

యమహా ద్విచక్ర వాహనం చోరీ

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : మండలంలోని కలవటాల గ్రామంలో ఇంటి ముందు పార్కు చేసిన యమహా 615 మోటార్ సైకిల్ ను గుర్తు తెలియని దుండగులు చోరీ చేసినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. బాధిత కుటుంబ సభ్యుడు చంద్రశేఖర్ వివరాల మేరకు మార్చి 25వ తేదీన వైఎస్ఆర్ కడప జిల్లా ముత్తులూరు చెందిన బంధువు అంకాలయ్య యమహా బైకుపై కలవటాలకు వచ్చాడు. ఇంటి సమీపంలో బైక్‌ను పార్క్ చేసి ఉంచాడు.మరుసటి రోజు అంకాలయ్య, చంద్రశేఖర్ తదితరులు వచ్చి చూడగా పార్కు చేసి ఉంచిన యమహా బైక్ కనిపించలేదు. దీంతో బైక్ ను గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారని, ఇటీవలే రూ.లక్షా 30వేలు సెకండ్ హ్యాండ్ బైకుగా కొనుగోలు చేసినట్టు బాధితుడు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశామని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.

సలీం బాష జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

విశాలాంధ్ర - నందికొట్కూరు : సలీం బాష జీవితాన్ని ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలని నియోజవర్గ ఎమ్మెల్యే గిత్త జయసూర్య అన్నారు. బుధవారం నందికొట్కూరు పట్టణంలోని స్థానిక బైరెడ్డి నగర్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల కోట నందు పదవి విరమణ పొందిన ప్రధానోపాధ్యాయులు సలీం భాషా కి వారి సతీమణి హలీమాబి సమేతంగా ఎమ్మెల్యే గిత్త జయ సూర్య చేతులమీదుగా ఘనంగా సన్మానం చేశారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే పాల్గొని ఆయన మాట్లాడుతూ తన సర్వీసులో 42 సంవత్సరాల కాలాన్ని పూర్తి చేసుకొని ఈ రోజు పదవి విరమణ పొందుతున్నారని, ఆయన జీవితాన్ని ప్రస్తుత ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకొని విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం సన్మాన గ్రహీత సలీం భాష మాట్లాడుతూ తన 42 సంవత్సరాల పదవీకాలంలో జరిగిన విశేషాలను సుదీర్ఘంగా వివరించారు. బంధువులు మిత్రులు ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు సలీం భాషాని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు సాలమ్మ, ఉపాధ్యాయినులు అరుణ విజయ భారతి, లలితమ్మ, సరోజినీ దేవి,శంషాద్ బేగం, రూపవాణి,ఉషారాణి, శారదమ్మ, ఉపాధ్యాయులు వెంకటరమణ, వెంకటేశ్వర్లు, శ్రీనాథ్, మల్లికార్జున రెడ్డి, నాగశేషులు, రామిరెడ్డి, మురళీకృష్ణ , పాములేటమ్మ, రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి పనులకు సహకరించాలి

విశాలాంధ్ర - పాములపాడు : 340 సీ జాతీయ రహదారి పనులకు సహకరించాలని నంద్యాల జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అన్నారు. బుధవారం పాములపాడు మండలంలో జరుగుతున్న జాతీయ రహదారుల పనులను కలెక్టర్ రాజకుమారి జాయింట్ కలెక్టర్ ఎస్పీ ఆదిరాజ్ సింగ్ రాణా జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్‌లు కలిసి పాములపాడు మండలంలో పనులను అడ్డగించే ప్రదేశాలను పరిశీలించారు. పాములపాడులోని శ్రీ శారద విద్యానికేతన్ కరస్పాండెంట్ శ్రీనివాసరావు తనది 38 సెంట్లు నేషనల్ హైవేలో పోయిందని అంతకంటే ఎక్కువ తీసుకుంటున్నారని ఆయన కోర్టుకు వెళ్లడం జరిగింది. ఈ విషయంపై కలెక్టర్ రాజకుమారి మాట్లాడి కరస్పాండెంట్తో ఒప్పించడం జరిగింది ఆయన 38 సెంట్లు తీసుకునేందుకు ముందుకు రావడంతో పనులు వెంటనే స్టార్ట్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రుద్రవరం సమీపంలోని జెరూసలేం శాల దగ్గర ఆగిన పనులను పరిశీలించారు జెరూసలేం శాల సంబంధించిన వారుతో మాట్లాడి కలెక్టర్ రెండు మూడు రోజుల్లోపు మీ వస్తువులు తీసుకోవాలని తెలిపారు కోర్టు జాతీయ రహదారి పనులు అడ్డగించరాదని తెలిపిందన్నారు. రెండు రోజుల్లోపు సహకరించాలని లేనిపక్షంలో రోడ్డు వేస్తామని తెలిపారు. కృష్ణరావుపేట గ్రామ సమీపంలో సుంకులమ్మ గుడి వద్ద పనులు అడ్డగించడంతో గ్రామ ప్రజలతో కలెక్టర్ మాట్లాడారు ప్రభుత్వ భూమిలో గుడి నిర్మించారని ఎలాంటి నష్టపరిహారం ప్రభుత్వం నుండి రాదని అభివృద్ధికి సహకరించాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం కలెక్టర్ మీడియాతో కలెక్టర్ మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో దాదాపుగా 62 కిలోమీటర్లు జాతి రహదారి పనులు జరుగుతున్నాయని అందులో నంద్యాల జిల్లాలో మండ్లెం నుంచి ఆత్మకూరు వరకు వర్క్‌లు జరుగుతున్నాయని ఇందులో 600మీటర్లలో అక్కడక్కడ చిన్నచిన్న 100మీటర్లు 50మీటర్లు అట్లా కొంత అడ్డగించడం జరిగిందని అడ్డగింతలను పరిశీలించామన్నారు. ఆత్మకూరు నుండి దోర్నాల వరకు సెకండ్ ఫేసులో జరుగుతుందని ఆ రోడ్డు నిర్మాణానికి డీపీఆర్ చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. అది మంజూరయ్యలోపు ఈ పనులు పూర్తి చేయాలి అందుకని ఎవరైతే అడ్డగిస్తున్నారో వారు కూడా సహకరించి ముందుకు రావాలని అభివృద్ధికి ఆటంక పరిచరాదని జాతీయ రహదారి వేయడం వలన ఎంతో అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హైవే పిడి పద్మ ,ఆర్డీవో నాగజ్యోతి డిఎస్పి రామాంజనేయ సిఐలు సురేష్ కుమార్ రెడ్డి సుబ్రమణ్యం తాసిల్దార్ సుభద్రమ్మ ఎంపీడీవో చంద్రశేఖర్ ఎస్సై సురేష్ బాబు వివిధ శాఖల అధికారులు లు జాతీయ రహదారి అధికారులు పాల్గొన్నారు.

యాదవుల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం

విశాలాంధ్ర - జుపాడు బంగ్లా : రాష్ట్రంలోని యాదవులు అభివృద్ధి చెందాలంటే టీడీపీతోనే సాధ్యమని రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కడియం వెంకటేశ్వర్లు యాదవ్ అన్నారు. బుధవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరపు అచ్చం నాయుడు ఆధ్వర్యంలో యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ గా కడియం వెంకటేశ్వర్లు యాదవ్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ యాదవ్ మాట్లాడుతూ యాదవులు అభివృద్ధి చెందాలంటే టిడిపితోనే సాధ్యమని ఆయన అన్నారు. యాదవ కార్పొరేషన్ డైరెక్టర్గా అవకాశం కల్పించిన నంద్యాల పార్లమెంట్ టిడిపి ఇన్చార్జి మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే గిత్త జయసూర్య కి,టిడిపి నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసినట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో గుంజపల్లె నాగేంద్ర గౌడు, నీటి సంఘం చైర్మన్ కాగుల శంకర్ యాదవ్, చిన్న దస్తగిరి, సంపత్ కుమార్ యాదవ్, వడ్డే శంకర్, వడ్డే నవీన్ తదితరులు పాల్గొన్నారు.

యువత రాజకీయాల్లోకి రావాలి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : యువత రాజకీయాల్లోకి వచ్చి అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ యువతకు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసిన వ్యాస రచన పోటీలలో గెలుపొందిన 15సంవత్సరాలలోపు పిల్లలకు ఎమ్మెల్యే బహుమతులు అందించారు. స్థానిక రామలింగారెడ్డి కళ్యాణ మండపంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ బహుమతి ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యాసరచన పోటీల వల్ల పిల్లలనుండి నేను చాలా తెలుసుకున్నానన్నారు. ఆళ్లగడ్డ అభివృద్ధి గురించి పోటీల్లో పాల్గొన్న పిల్లలందరూ చాలా బాగా రాసారన్నారు. తన పుట్టినరోజు సందర్భంగా ప్రతి సంవత్సరం తల్లిదండ్రులు లేని ఒక అనాధను దత్తత తీసుకుంటానన్నారు. ఈ సంవత్సరమే కాకుండా ప్రతి సంవత్సరం ఒకరిని దత్తత తీసుకొని వారి బాగోగులు చూసుకుంటానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ హుస్సేన్ బాష, అనంత రామ సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఏపీవోగా గౌరీ బాయ్ బాధ్యతలు

విశాలాంధ్ర - రుద్రవరం : జాతీయ ఉపాధి హామీ పథకం మండల ఏపీఓగా గౌరీ భాయ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏపీవోగా విధులు నిర్వహిస్తున్న ప్రతాప్ బనగానపల్లె మండలానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో జూపాడు బంగ్లా మండల ఏపీఓ గౌరీ బాయ్ నీ సంబంధిత శాఖ ఉన్నతాధికారులు బదిలీ చేయడంతో ఆమె బాధ్యతలు స్వీకరించారు. అలాగే సిరివెళ్ల మండలం నుంచి బదిలీపై రుద్రవరం మండలానికి నియమించడంతో కంప్యూటర్ ఆపరేటర్ ఎస్.కె హసీనా బాధ్యతలు స్వీకరించారు. టెక్నికల్ అసిస్టెంట్లు ఘన మద్దిలేటి, శ్రీకాంత్ రెడ్డి, నరసింహులు, నరసింహారెడ్డి వీరు బదిలీపై మండలానికి నియమించడంతో వారు బాధ్యతలు చేపట్టారు.

అవుకు విద్యార్థినిలకు ప్రథమ బహుమతి

విశాలాంధ్ర-అవుకు : నంద్యాల పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్ నందు జరుగుతున్న జిల్లా స్థాయి ఈఎండిపి పోటీలలో అవుకు జిల్లా పరిషత్తు బాలికలు ఉన్నత పాఠశాల విద్యార్థినీలు ఉత్తమ ప్రతిభను కనబరిచి మొదటి స్థానంలో నిలిచారని పిటిఐ ఉపాధ్యాయురాలు విజయ కుమారి అన్నారు. ఈ పోటీలలో 15 పాఠశాలలకు చెందిన విద్యార్థినులు పాల్గొనగా మొదటి స్థానంలో నిలిచిన బాలికలు ఉన్నత పాఠశాల విద్యార్థినీలకు నంద్యాల డిప్యూటీ డిఇఓ శంకర్ ప్రసాద్, డోన్ డిప్యూటీ డిఈఓ వెంకట్రామిరెడ్డిలు బహుమతులు అందించారు. బహుమతి సాధించిన విద్యార్థినిలను, పిటిఐ ఉపాధ్యాయురాలు విజయ కుమారిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చెన్నకేశ్వరి, ఉపాధ్యాయనీలు మంజుల, సుబ్బలక్ష్మి, రాధిక, లత, విజయ కుమారీలు అభినందించారు.

ఎన్‌సీడీ సర్వే 55శాతం పూర్తి

విశాలాంధ్ర - చాగలమర్రి : 55% పూర్తయిందని జిల్లా నోడల్ అధికారి కాంతారావు నాయక్ తెలిపారు. బుధవారం చాగలమరి పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి వివిధ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సర్వే 55 శాతం పూర్తయిందని ఈనెల చివరి కల్లా 100% పూర్తి చేస్తామన్నారు. ఈ సర్వేలో బీపీ షుగర్ తదితర అనుమానిత కేసులను స్థానిక వైద్యశాలలో పరిశీలించి చికిత్సలు చేయడం జరుగు తుందన్నారు. రొమ్ము క్యాన్సర్, నోటి క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ లాంటివి అనుమానిత కేసులు ఉంటే వారిని స్థానిక వైద్యశాలలో పరిశీలించి నంద్యాలలోని పిఓయు కేంద్రానికి పంపించడం జరుగు తుందన్నారు. అక్కడ మంగళ, గురువారాలలో పరీక్షలు జరిపి క్యాన్సర్ అని నిర్ధారణ అయితే చికిత్స కొనసాగించడం జరుగుతుందన్నారు. అనంతరం పట్టణంలో జరుగుతున్న సర్వేను ఆయన పరిశీలించారు.కార్యక్రమంలో వైద్యులు ఇమ్రాన్, సిహెచ్ఓ రమణమ్మ,హెల్త్ఎడ్యుకేటర్ వెంకటమ్మ, సూపర్వైజర్ రామలింగారెడ్డి,ఆరోగ్య,ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మూలపెద్దమ్మ హుండీ లెక్కింపు

విశాలాంధ్ర-గడివేముల : మండల కేంద్రమైన గడివేములలో వెలసిన శ్రీ మూలపెద్దమ్మ హుండీ లెక్కించ్చారని ఆలయ ఈఓ రామలింగారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అమ్మవారి జాతర మహెూత్సవం లో ఏర్పాటు చేసిన తాత్కాలిక హుండీ, శాశ్వత హుండీ లెక్కించమన్నారు. తాత్కాలిక హుండీ ద్వారా రూ.1,94,094/- శాశ్వత హుండీ ద్వారా రూ.4,53,448/- మొత్తం రూ6,47,543/- ఆదాయ వచ్చిందని ఈఓ రామలింగారెడ్డి తెలిపారు. ప్రత్యేక చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ సి.ఎన్ తిరుమల రెడ్డి పర్యవేక్షణలో ఈ హుండీలు లెక్కించారు. దేవస్థాన చైర్మన్ దేశం రమణారెడ్డి,దేశం నరేంద్రారెడ్డి, కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది రామసుబ్బయ్య పాల్గొన్నారు.

కార్యకర్తలే టీడీపీకి పునాది

విశాలాంధ్ర- కొలిమిగుండ్ల : టీడీపీకి కార్యకర్తలే పునాదని, కష్టకాలంలో కూడా వెనుకడుగు వేయకుండా పార్టీకి వారందిస్తున్న సేవలు మరువలేనివని తెలుగు యువత మండల అధ్యక్షులు గొంగటి హుస్సేన్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని తన స్వగ్రామమైన పెట్నికోటలోని టిడిపి కార్యాలయం నందు పార్టీ సభ్యత్వ కార్డులను ఆయన పంపిణీ చేశారు. టీడీపీ సభ్యత్వం తీసుకున్న వారికి ధన్యవాదాలు తెలిపారు. గ్రామంలో టిడిపి సభ్యత్వానికి విశేష స్పందన లభించిందని, 999 మంది టిడిపి సభ్యత్వం తీసుకున్నారని వారందరికీ కార్డులను అందిస్తున్నామని తెలిపారు. టీడీపీ కార్యకర్తలకు అభిమానులకు సభ్యులకు మంత్రి బీసి జనార్దన్ రెడ్డి, పార్టీ అధిష్టానం ఎప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.

గృహ నిర్మాణాలు చేపట్టాలి

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్ : పట్టణంలో ప్రభుత్వ గృహాలు మంజూరై వివిధ నిర్మాణ దశలలో ఉన్న బీసీ, ఎస్సీ రూ.50వేలు, ఎస్టీ రూ.75వేలు, పివి టీజీ రూ.1లక్ష లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సహాయం క్రింద అమౌంట్ క్రెడిట్ అయినందున లబ్దిదారులకు జిల్లా గృహనిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ హరిగోపాల్, ఆత్మకూరు మునిసిపల్ కమీషనర్ రమేష్ బాబు డోర్ టు డోర్ తిరిగి లబ్ధి దారులకు గృహ నిర్మాణాలు మే 31, 2025 లోపల పూర్తి చేసుకోవాలని అవగాహనా కల్పించి వార్డు అమినీటిస్ సేక్రటరీలకు సమావేశం నిర్వహించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డి.ఇ నాగరాజు, ఎ.ఇ ఉమా మహేశ్వర రెడ్డి, వర్క్ ఇన్స్పెక్టర్లు నాయక్, సుబ్బలక్ష్మమ్మ పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 03, ఏప్రిల్ 2025

పశువుల నీటి తొట్ల నిర్మాణం : జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : వేసవి కాలంలో పశువులు, మూగ జీవాల దాహార్తి తీర్చేందుకు 300 పశువుల నీటి తొట్లలను నిర్మించడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. బుధవారం కర్నూలు మండలం దిన్నెదేవరపాడు గ్రామ శివార్లలో పశువుల నీటి తొట్ల నిర్మాణానికి జిల్లా కలెక్టర్, కోడుమూరు ఎమ్మెల్యే భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి కాలంలో గ్రామాల్లో పశువులు, గొర్రెలు, మేకలు తదితర మూగ జీవాలకు తాగునీటి కోసం ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా నీటి తొట్ల లను నిర్మించడం జరుగుతోందని, ఇందులో భాగంగా జిల్లాలో 300 నీటి తొట్లల నిర్మాణాలు చేపడుతున్నామని తెలిపారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద సీసీ రోడ్లు, నీటి సంరక్షణ పనులతో పాటు వేసవి కాలంలో మూగజీవాలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా పశువుల దాహం తీర్చడానికి నీటి తొట్లను ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ వెంకట రమణయ్య, కర్నూలు రూరల్ తహశీల్దార్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇలా అయితే పిల్లల ప్రాణాలు పోవా..

- బడి ఆవరణలో ప్రమాదకరంగా విద్యుత్ వైరు
- పట్టించుకోని విద్యాధికారులు

విశాలాంధ్ర - సి.బెళగల్: ఇలా అయితే ప్రమా దం జరిగి పిల్లల ప్రాణాలు బలికావా అంటూ తల్లి దండ్రులు వాపోతు న్నారు. మండల పరిధి లోని బ్యాతోలి గ్రామంలోని పాఠశాలో మోటార్ విద్యుత్ వైరు ప్రమాద కరంగా ఉంది. కేవలం మూడడుగుల ఎత్తులో నుండి పాఠశాల కప్పు మీదకు ఆ వైరు వెళ్ళింది. అయితే ఆ విద్యుత్ మోటార్ దగ్గరే విద్యార్థులు మధ్యాహ్నం వేళ భోజనం చేసి అక్కడే ప్లేట్లు కడుక్కొని, నీళ్లు తాగి తరగతి గదుల్లోకి వెళ్తుతుంటారు. ప్రమాదం జరగకుండా వైరుకు మాత్రం స్లాబ్ లోపలి పైప్‌ను వేసినను ఆ పైపు ఎండలకు, వానలకు ఎండి రాలిపో యింది. ఆ విద్యుత్ వైరు కూడా కాలం చెల్లినట్లు దర్శనమి స్తోంది. అయినను విద్యాధి కారులకు గ్రామస్తుల నుండి సమాచారం తెలిసినను పట్టించుకున్న పాపాన పోలేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా విద్యాధికారులు స్పందించి ప్రమాదం జరగక మునుపే తగుచర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

// సంక్షిప్త సమాచారం //

విశాలాంధ్ర-హొళగుంద: జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు కురువ బుజ్జమ్మ ఆధ్వర్యంలో రూ.10 లక్షల జెడ్పీ నిధులను మంజూరు చేశారని మండల ఏఈ యమునప్ప బుధవారం తెలిపారు. ఈ నిధులతో బొమ్మ గుండనహళ్లి, చిన్న హ్యాటలో వివిధ దశలో ఉన్న అంగన్‌వాడీ భవనాలకి నిధులు ఖర్చు చేస్తామని అన్నారు. అంగనవాడీ భవనాలకు విద్యుత్, వాకిళ్లు, కిటికీలు, ఫ్లోరింగ్, భవనాలకు కొత్త రంగు వేస్తామని అన్నారు. అసంపూర్తిగా ఉన్న అంగన్వాడి భవనాలను పూర్తిస్థాయిలో నిర్మించి పూర్వ విద్యార్థుల విద్యాభివృద్ధికి సహకరిస్తామని అన్నారు. ఎన్నో ఏళ్ల నుండి పూర్తికాక నిలబడిన అంగన్వాడి భవనాల రూప రేఖలను మారుస్తామని మండల అభివృద్ధికి తాము ఎంతో కష్టపడతామని అన్నారు. సమావేశంలో వైసీపీ సీనియర్ నాయకుడు కోకిల తోట శేషప్ప పాల్గొన్నారు.

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: సచివాలయం ద్వారా అందిస్తున్న సేవలను పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సచివాలయం సిబ్బందిని ఆదేశించారు. బుధవారం నగరంలోని బి.క్యాంప్‌లో 56వ వార్డు సచివాలయాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముందుగా సచివాలయం సిబ్బంది హాజరు పట్టికను పరిశీలిస్తూ సిబ్బంది హాజరుతో పాటు వారు నిర్వర్తిస్తున్న విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం సేవలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ప్రజలకు చిత్తశుద్ధితో సేవలు అందించాలని కలెక్టర్ సిబ్బందికి సూచించారు.

విశాలాంధ్ర - పెద్దకడబూరు: దివ్యాంగులను ఎవరూ అగౌరవపరచ కూడదని ఉపాధ్యాయులు నర్సింహులు అన్నారు. బుధవారం స్థానిక మండల ప్రాథమిక మెయిన్ పాఠశాలలో మండల విద్యాధికారులు సువర్ణల సునియం, రామ్మూర్తి ఆధ్వర్యంలో ప్రపంచ మూగవ్యాధి దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు ఎక్కడ ఉన్నా గౌరవించాలని, వారిలోని ఒంటరి తనాన్ని పోగొట్టి సమాజంలో ఉన్నతంగా చూడాలన్నారు. వారిని అడ్డపేర్లతో పిలవరాదని, వారి అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పాటును అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కేశవ, మల్లికా బేగం, సహిత, ఉపాధ్యాయులు ఎర్రకోట గోపాల్, సుబ్బారాయుడు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : రాష్ట్ర వ్యాప్తంగా పౌరులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చేపట్టిన వర్క్ ఫ్రం హోం సర్వేను నగరంలో జరుగుతుందని నగరపాలక అదనపు కమిషనర్ ఆర్జీవీ కృష్ణ వెల్లడించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నగరంలో 18 నుండి 50 ఏళ్లలోపు 2.73 లక్షల మంది పౌరులను సర్వే చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిందని, ఇప్పటికి 1.73 లక్షల మందికి సర్వే పూర్తి అవ్వగా, మిగిలిన లక్ష మందికి సర్వే చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. ఉద్యోగులు వర్క్ ఫ్రం హోం చేస్తున్నవారి వివరాలతో పాటుగా వారి అభిప్రాయాలను సైతం సచివాలయ సిబ్బంది సేకరించడం జరుగుతుందని, అందుకను గుణంగా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. నగర ప్రజలు ఈ సర్వేకు సహకరించాలని అదనపు కమిషనర్ కోరారు.

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో ఉన్న బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ బీఈడీ నాలుగు, ఒకటో సెమిస్టర్ సెప్టెంబర్ 2024, అక్టోబర్ 2024 సంబంధించిన పరీక్షల పునర్ మూల్యాంకనం ఫలితాలను ఇంచార్జీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఉమా ఆదేశాల మేరకు బుధవారం కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ అధికారి వెంకటేశ్వర్లు పరీక్ష ఫలితాలను విడుదల చేశారు. బీఈడీ సెమిస్టర్ ఫోర్ పరీక్షలకు విద్యార్థులు దరఖాస్తు 108 చేసుకోగా, 52 విద్యార్థి విద్యార్థులు పాసయినట్లు ఆయన తెలిపారు. సెమిస్టర్ మొదటికి 350 దరఖాస్తు చేసుకోగా 148 మంది పాసైనట్టు ఆయన తెలిపారు. రాయలసీమ యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో ఫలితాలను చూసుకోవచ్చన్నారు.

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: 42 రోజులపాటు వేసవి ట్రైనింగ్ కోర్సుకు దరఖాస్తు ఆహ్వానించబడుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.సామెల్ పాల్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కోర్సు విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, కడప, అనంతపురంలో మే ఒకటో తారీకు నుండి జూన్ 11వ తేదీ వరకు జరుగుతుందని, ఆన్‌లైన్ అప్లికేషన్ ఈనెల మూడో తారీకు నుంచి 25 తేదీ వరకు ప్రభుత్వ పరీక్షల కార్యాల వెబ్‌సైట్ www.bse.ap.gov.in నందు అందుబాటులో ఉంటుందని, పూర్తి వివరాలు అందులో చూసుకోవాలని ఆయన తెలిపారు.

విశాలాంధ్ర - ఆదోని : శ్రీ మహాయోగి లక్ష్మమ్మ అవ్వ 93వ రథోత్సవం సందర్భంగా అవ్వకి 1.3 కెజీలతో బంగారు కిరీటం తయారు చేయించడం జరిగిందని ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త మాజీ ఎమ్మెల్యే రాచోటి రామయ్య తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కిరీటమును జాతర రోజు ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త ఆధ్వర్యంలో అవ్వకు అలంకరించడం జరుగుతుందని తెలిపారు. కిరీటాన్ని తయారు చేయడానికి సహకరించిన జీఆర్టీ జెవెల్లర్స్, చంద్రశేఖర్ ఆజాద్ ఆర్జేసీ, ఎండోమెంట్ డిపార్ట్మెంట్, పాండురంగా రెడ్డి, జేవీవో, వెంకటేశ్వర్లు తదితరులు ధన్యవాదాలు తెలిపారు.

విశాలాంధ్ర - సి.బెళగల్ : పొదుపు మహిళలు మూడు రోజులపాటు జరిగే అవగాహన సదస్సు కార్యక్రమానికి ప్రతి పొదుపు మహిళ తప్పకుండా హాజరు కావాలని ఏపీఎం రమేష్ అన్నారు. బుధవారం మండలంలోని శ్రీ శక్తి భవనంలో పొదుపు మహిళలకు ఏర్పాటు చేసిన మహిళల ఆర్థిక ప్రణాళికపై అవగాహన సదస్సు కార్యక్రమంలో ఏపీఎం రమేష్ మాట్లాడుతూ ప్రతి పొదుపు మహిళ సభ్యులు వెలుగు సీసీలు పొదుపు మహిళలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం రమేష్‌తో పాటు సీసీలు బుక్ కీపర్లు పొదుపు లక్ష్మి సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - మంత్రాలయం : రాష్ట్రస్థాయి నుంచి మండల స్థాయి వరకు వైఎస్ఆర్సిపి పార్టీ పలు కమిటీల నియామకాల్లో కుల సమీకరణాల ఆధారంగా ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ సభ్యులను గుర్తిస్తూ కొన్ని స్థానాలు కేటాయించడం జరిగింది. అందుకు కృతజ్ఞత తెలుప దానికి కౌతాళం మండల నాయకులు, కమిటీ సభ్యులు బుధవారం ఎమ్మెల్యే స్వగ్రామం రాంపురం నందు ప్రత్యేక సమావేశం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో మంత్రా లయం, కోసిగి, కౌతాళం, పెద్ద కడుబూరు మండలాల కమిటీల్లో కుల సమీకరణాల భాగంగా ఎస్సీ, ఎస్టీ బీసీ మైనారిటీ నేతలకు సమానంగా స్థానాలు కల్పించామన్నారు. మండల నాయకులు భీమిరెడ్డి, ప్రహల్లాద్ ఆచారి, ఎంపీపీ అమరేశా, మాబుసాబు, ఏకామి రెడ్డి, లింగన్న గౌడ,గురునాథరెడ్డి, పాల్ దినకర్, జయపాల్, చన్నప్ప ధని, బుజ్జిస్వామిపాల్గొన్నారు.

విశాలాంధ్ర - హొళగుంద: మండలంలోని పెద్దహ్యాట వీరభద్ర స్వామికి శ్రీశైలం పీఠాధిపతి డాక్టర్ చిన్న సిద్ధ రామ పండితారాధ్య శివ చార్య మహా స్వాములు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. శ్రీశైలం పీఠాధిపతి కి పూజారులు వంపయ్య స్వామి, రాచాయ్య స్వామి, ఘనంగా స్వాగతించి పూజలు జరిపారు. గ్రామంలోకి శ్రీశైలం పీఠాధిపతి రావడం పట్ల ప్రజలు ఎంతో ఆనందించారు. గ్రామ పెద్దలు, ప్రజలు స్వామికి నగదును అందించి మొక్కుబడి తీర్చుకున్నారు.

బీఎల్‌వోలు నిబద్ధతతో పని చేయాలి

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : ఎన్నికల విధులను నిబద్ధతతో పని చేయాలని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు బీఎల్‌వోలకు సూచించారు. బుధవారం స్థానిక ఎస్బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో బీఎల్‌వోలకు వార్షిక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ ఫాం 6, 7, 8 లను నింపటంపై పూర్తి అవగాహనతో ఉండాలని, పోలింగ్ కేంద్రాల వద్ద సౌకర్యాలు అవసరమనుకుంటే తమ దృష్టికి తీసుకొని రావా లన్నారు. హ్యాండ్ బుక్‌ను చదివి ఎన్నికల విధులు, నిబంధనలు, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని బీఎల్వోకు కమిషనర్ సూచిం చారు. కార్యక్రమంలో ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, తహ శీల్దార్ వెంకటలక్ష్మి, సూపరింటెండెంట్లు మన్సూరు బాష, క్రిస్టోఫర్, డిప్యూటీ తహశీల్దార్ ధనుంజయ, ఆర్ఐలు భార్గవ్, రాజు పాల్గొన్నారు.

పశువుల నీటి తొట్టి నిర్మాణానికి భూమిపూజ

విశాలాంధ్ర - పెద్దకడబూరు: మండల పరిధిలోని హనుమాపురం గ్రామంలో పశువుల నీటి తొట్టి నిర్మాణం కోసం టీడీపీ గ్రామ నాయకులు బీపీ ఈరన్న బుధవారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా పశువులకు నీటి సౌకర్యం కోసం తొట్టి నిర్మించడం జరుగుందన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని పశువుల దాహార్తిని తీర్చడానికి నీటి తొట్టి ఉపయోగపడుతుందన్నారు. ఏపీవో ఖాదర్ బాష, టీపీ రామ్మోహన్ రెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల పని వేళలు మార్చాలి

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు: వేసవి ఉష్ణోగ్రతలు ఏప్రిల్ నుంచి జూన్ వరకూ తీవ్రంగా ఉంటాయని, వాతావరణ పరిశోధన కేంద్రం ప్రకటించి నందున మున్సిపల్ కార్మికుల పని వేళలను మార్చాలని ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు ఎల్లప్ప అన్నారు. గురువారం పాత మున్సిపల్ కార్యాలయంలో నిరసన వ్యక్తం చేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు ఎల్లప్ప, తాలూకా అధ్యక్ష కార్యదర్శులు వీరేష్, తిమ్మగురుడులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు పూర్తిగా మండుటెండలో పని చేయాల్సి వస్తున్నందున, త్వరగా అలసట చెందడం, వడగాడ్పులకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. కార్మికుల పనివేళలను మార్చి వారి ఆరోగ్యాన్ని కాపాడేందుకు సత్వరమే చర్యలు చేపట్టాలన్నారు. ఉదయం 5:30 నుంచి 11:30 గంటల మధ్య మాత్రమే కార్మికులతో పని చేయించాలని, ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని మంచినీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలని కోరారు. వడగాడ్పులకు గురైన కార్మికులకు ప్రభుత్వమే వైద్య సేవలు అందించాలని, వైద్య సేవలు అవసరమైన అన్ని రోజులు జీతంతో కూడిన సెలవు దినాలుగా పరిగణించాలన్నారు. ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి విజయేంద్ర, శివ, సల్మాన్, నల్లారెడ్డి, వెంకట్రాముడు, రమాదేవి, సల్మాన్, ఈరన్న, చిన్ని కేశన్న, గౌరమ్మ, సరస్వతి, రోగన్న, పృథ్వీరాజ్, చిన్న వెంకటరాముడు, నల్లన్న పాల్గొన్నారు

ఐఆర్ 30 శాతం ప్రకటించాలి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: ఐఆర్ 30 శాతం ప్రకటించాలని ఫ్యాప్టో నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం రాష్ట్ర ఫ్యాప్టో ఇచ్చిన పిలుపు మేరకు మధ్యాహ్నం 3 గంటల నుండి 5 గంటల కర్నూలు జిల్లా ఫ్యాప్టో ఆధర్యంలో ఉపాధ్యాయులు భారీగా కలెక్టరేట్ ఎదుట హాజరై నల్ల బ్యాడ్జిలు ధరించి, నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫ్యాప్టో కో చైర్మన్, కర్నూలు జిల్లా ఫ్యాప్టో ఇంచార్జి కాకి ప్రకాష్ రావులు హాజరై మాట్లాడుతూ పీఆర్సీ కమిటీ వేసి, వెంటనే 30 శాతం ఐఅర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కర్నూలు జిల్లా ఫ్యాప్టో చైర్మన్ సేవా లాల్ నాయక్ అధ్యక్షతన కొనసాగిన ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు సురేష్ కుమార్, రాష్ట్ర ప్రభుత్వం అధికారంలో వచ్చిన వెంటన్ ఉపాధ్యాయ, ఉద్యోగుల అన్ని బకాయిలు తీరుస్తాం అని చెప్పి కొద్ది మొత్తం మాత్రమే వేశారన్నారు. మిగిలిన వాటికి కనీసం రోడ్ మ్యాప్ ఇపకటించటం లేదన్నారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గోఖారి ఆంగ్ల మాధ్యమంకు సమాంతరంగా తెలుగును కొనసాగించాలి అని డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ 1938 నాయకులు ఇస్మాయిల్ మాట్లాడుతూ 2022 నుండి సరెండర్ లీవ్‌లు బకాయిలు ఉన్నాయని, వాటిని వెంటనే చెల్లించాలని కోరారు.

వక్ఫ్ బోర్డ్ సవరణ బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలి : ఇన్సాఫ్

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు: మైనారిటీలను బీజేపీ ప్రభుత్వం మత ద్వేషాన్ని చిమ్ముతూ మతకలహాలు సృష్టిస్తుందని, కేంద్రా ప్రభుత్వం బుధవారం రోజున లోక్ సభలో ప్రవేశపెడుతున్న వక్ఫ్ బోర్డ్ సవరణ బిల్లు ఉపసంహరించుకోవాలని ఇన్సాఫ్ పట్టణ గౌరవ అధ్యక్షుడు కేసీ జబ్బర్, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు అజార్, సమీవుల్లా తెలిపారు. సీపీఐ కార్యాలయంలో ఇన్సాఫ్ పట్టణ సమితి సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ నరేంద్రమోడీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ముస్లిం మైనార్టీలకు తీవ్రమైన అన్యాయం చేస్తుందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వంలో కీలక పాత్ర పోషిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ సవరణ బిల్లును తక్షణమే ఉపసంహరించునే విధంగా కేంద్రంపై ఒత్తిడి తేవాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమావేశంలో ఇన్సాఫ్ నాయకులు దాదావలి, ఖాజా, ఇస్మాయిల్, రఫీక్, నబీసాబ్, టైలర్ ఖాజా, బాష, ఖాదర్, సమీర్ పాల్గొన్నారు.

నీటి ఎద్దడి రాకుండా అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - సి.బెళగల్: ఎండలు తీవ్రతరం అవుతున్నందున గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా గ్రామ సర్పంచ్లు గ్రామస్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆర్డబ్ల్యూఎస్ ఏఈ గోనే నాయక్ అన్నారు. బుధవారం తుంగభద్రా నదిలోని నీటిని ఆయన పరిశీలించి మాట్లాడుతూ వేసవిలో ఎండలు తీవ్ర మవుతున్నందున గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఎద్దడీ రాకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి గోనె నాయక్ బుధవారం తుంగభద్ర నదిలో పరిశీలన చేశారు. మండలంలో ఆయా గ్రామాలలో నీటి ట్యాంకులను, తాగునీటి పథకాలను తనిఖీ చేసి, ఎప్పటికప్పుడు నీటి సమస్య రాకుండా సర్పంచులు, గ్రామ స్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఆపదలో ఉన్న వారికి ఆపన్నహస్తం ధరణీరెడ్డి

విశాలాంధ్ర - పెద్దకడ బూరు : ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తం వైసీపీ యువనేత ధరణీ రెడ్డి అని వైసీపీ నాయకులు గంగులపాడు పేరెంట్స్ కమిటీ వైస్ చైర్మన్ రమేష్ స్పష్టం చేశారు. బుధవారం మంత్రాలయం మండలంలోని రాంపురం గ్రామంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి తనయులు, వైసీపీ యువనేత ధరణీ రెడ్డి జన్మదిన వేడుకలను ఎమ్మెల్యే సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డిచే కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. రమేష్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎవరికి ఏ కష్టమొచ్చినా రాజకీయాలకు అతీతంగా సహాయ చేసే దాతృత్వం ఉన్న నాయకులు ధరణీరెడ్డి అన్నారు.

జాతీయ సదస్సును జయప్రదం చేయండి : ఏఐకేఎస్

విశాలాంధ్ర - కోడుమూరు: ఈ నెల 4న కర్నూలు నగరంలో నిర్వహించే ప్రాంతీయ రైతు సదస్సును జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి బి.రాజు, ఏఐకేఎస్ మండల అధ్యక్షుడు గొల్ల రాజులు కోరారు. బుధవారం పట్టణంలోని స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఏఐకేఎస్ ఆధ్వర్యంలో కరపత్రాలను విడుదల చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బి.రంగస్వామి, ఏఐటీయూసీ తాలూకా కార్యదర్శి ఎం.రాముడు, హమాలి సంఘం ప్రెసిడెంట్ బజారి, సుంకన్న, రైతులు వీరప్ప, నాగన్న, లక్షన్న తదితరులు పాల్గొన్నారు.

క్లస్టర్ యూనివర్శిటీలో ప్రొఫెసర్ వి.ఉమా

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: ప్రఖ్యాత విద్యావేత్త, పద్మావతి మహిళా విశ్వ విద్యా లయ వైస్ ఛాన్సలర్, క్లస్టర్ విశ్వ విద్యాలయ ఇంచార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వి.ఉమా బుధవారం క్లస్టర్ యూనివర్శి టీలో అధ్యాపక సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రొఫెసర్ మాట్లాడుతూ నాణ్యత గల పరిశోధన ప్రాముఖ్యతపై ప్రసంగించారు. పరిశోధన మాత్రమే కాదు, అది సమాజానికి ఎంత ప్రాముఖ్యత ఉన్నదో తెలుసుకోవాలి అని ఆమె తెలిపారు. సమాజంలో సానుకూల మార్పులు తీసుకురావడానికి పరిశోధన, కొత్త కోర్సులు, పరిశోధనలు అవసరమని చెప్పారు. క్లస్టర్ యూనివర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాళ్లు డాక్టర్ ఎస్.కుమార్, డాక్టర్ ఇందిరాశాంతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కర్నూలు - విజయవాడ మధ్య విమాన సర్వీసులు ప్రారంభించండి : మంత్రి

ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసిన టీజీ

విశాలాంధ్ర - బ్యూరో కర్నూలు : కర్నూలు నుండి విజయవాడకు విమాన సర్వీసులు ప్రారంభించాలని పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును కోరినట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి కర్నూలు - విజయవాడ విమాన సౌకర్యంపై చర్చించినట్లు తెలిపారు. ఈ విషయంపై సంబంధిత అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నానని కేంద్ర మంత్రి తెలిపినట్లు టీజీ భరత్ చెప్పారు. త్వరలోనే దీనికి సంబంధించి అడుగులు పడే అవకాశం ఉందని చెప్పారన్నారు. కర్నూలు - విజయవాడ విమాన సౌకర్యం కల్పించేందుకు కేంద్ర మంత్రి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌లో పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇక్కడ అన్ని రకాల పరిశ్రమలు పెట్టేందుకు అనుకూలమైన పరిస్థితులు ఉన్నాయని ఆయన తెలిపారు. విమాన సర్వీసు కూడా అందుబాటులోకి వస్తే పారిశ్రామికవేత్తల రాకపోకలకు సౌకర్యంగా ఉంటుందన్నారు.

అంగన్‌వాడీలను ఒత్తిడికి గురి చేయొద్దు

విశాలాంధ్ర- వెల్దుర్తి: అంగన్‌వాడీ టీచర్లను ఒత్తిడికి గురి చేయొద్దని అంగన్‌వాడీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు చాందిని, ప్రాజెక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు సుజాత, సంధ్యారాణి స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీఓ లుక్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం బాలసంజీవిని అప్ 2.0 కొత్త వెర్షన్ వచ్చిందని, ఆ యాప్ అందరు తప్పకుండ డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. ఈ యాప్ కొత్త వెర్షన్‌లో అంగన్వాడీ టీచర్ ఫేస్ అథెంటికేషన్, లబ్ధిదారులు ఫేస్ అంతేంటికేషన్ ఫుడ్ సంభందించిన వివరాలు ఎక్కువ జత చేయడం జరుగుతుందన్నారు. రెగ్యులర్ ఉద్యగులకు అమలు చేయవలసిన పనులన్నీ అంగన్వాడీ సిబంధిని ఒత్తిడి గురి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈదమ్మ, వవరలక్ష్మి, శిరీష, శామీనా, విజయకుమారి, సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

పదవీ బాధ్యతలు చేపట్టిన యూనివర్సిటీ ఇంచార్జీ

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: రాయలసీమ యూనివర్సిటీ ఇన్చార్జ్ వైస్ ఛాన్సలర్ ఆచార్య వి.ఉమ బుధవారం వర్సిటీని సందర్శించారు. తిరుపతిలోని పద్మావతి మహిళా విశ్వవిద్యాలయ వీసీగా విధులు నిర్వహిస్తున్న ఆచార్య ఉమను రాయలసీమ యూనివర్సిటీ ఇన్చార్జ్ వీసీగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గత నెల 25న విడుదల చేసింది. రాయలసీమ యూనివర్సిటీ వీసీ ఆచార్య వి.వెంకట బసవరావు వ్యక్తిగత పర్యటన నిమిత్తం అమెరికాకు వెళ్లిన కారణంగా ఈ నియామకం చేపట్టినట్లు రాష్ట్ర ఉన్నతవిద్యాశాఖ కార్యదర్శి కోనశశిధర్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇన్చార్జ్ వీసీ ఆచార్య వి.ఉమకు రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయ్ కుమార్ నాయుడు స్వాగతం పలికారు. అనంతరం వీసీ చాంబరులో సైన్స్ కాలేజి ప్రిన్సిపాల్ ఆచార్య సీవీ కృష్ణారెడ్డి, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య ఎన్.నరసింహులు, డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య పీవీ సుందరానంద్, రీసర్చ్ డైరెక్టర్ ఆచార్య సి.విశ్వనాథరెడ్డి, డీన్ ఆఫ్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య ఆర్.భరత్ కుమార్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్లుతో ఆచార్య ఉమ సమావేశమై వర్సిటీకి సంబంధించిన విషయాలను చర్చించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లుతోపాటు వివిధ విభాగాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది ఇన్చార్జ్ వీసీకి శుభాకాంక్షలు తెలిపారు.

తహశీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - పెద్దకడబూరు : సమయపాలన పాటించని తహశీల్దార్‌పై చర్యలు తీసుకోవాలంటూ బుధవారం మండల పరిధిలోని కల్లుకుంట గ్రామంలో బీకేఎంయూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ మండల సహాయ కార్యదర్శి కుమ్మరి చంద్ర, సీనియర్ నాయకులు హనుమంతు, పార్టీ సభ్యులు రాజు మాట్లాడుతూ తహశీల్దార్ కార్యాలయంలో ఉదయం 11 గంటలైనా అధికారులు లేక ఖాళీ కుర్చీలు దర్శనం ఇస్తున్నాయని విమర్శించారు. మండలానికి రెగ్యులర్ తహశీల్దార్ లేకపోవడంతోనే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయన్నారు. అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, ఇంచార్జీ తహశీల్దార్ గీతా ప్రియదర్శిని సమయపాలన పాటించడం లేదన్నారు. కార్యాలయం తీరు ఇలా ఉంటే, రైతుల, ప్రజల సమస్యలపై ప్రశ్నించే వారిపైన కేసులు పెట్టడం సిగ్గుచేటన్నారు. తక్షణమే ఆదోని సబ్ కలెక్టర్ స్పందించి సమయపాలన పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగరాజు, చాకలి తిక్కన్న, కోలంట్ల వీరేష్, బజ్జయ్య, జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో..

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, గురువారం 03, ఏప్రిల్ 2025

డ్రోన్ కెమెరాల ద్వారా ప్రత్యేక నిఘా

విశాలాంధ్ర - పాములపాడు : జిల్లాలో నీరు నియంత్రణ కొరకు డ్రోన్ కెమెరాలను ఉపయోగిస్తున్నామని గతం కంటే జిల్లాల్లో క్రైమ్ రేటు తగ్గిందనీ ఎస్పీ ఆదిరాజ్ సింగ్ రాణా తెలిపారు. బుధవారం జిల్లా ఎస్పీ అది రాజ్ సింగ్ రాణా పాములపాడు పోలీస్ స్టేషనుకు రాగానే ఎస్సై సురేష్ బాబు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందితో శాఖ పరమైన గౌరవ వందనాన్ని చేశారు. ఎస్ వీ స్టేషన్ పరిసరాలను క్షుణ్ణంగా పరి రికార్డులను పరిశీలించి నిర్వహణపై సంతృప్తి వ్యక్త పరిచారు. అనంతరం ఎస్పీ మీడియాతో మాట్లా డుతూ జిల్లాలో గత సంవత్సరం కంటే క్రైమేట్ తగ్గిందని తెలిపారు, ముఖ్యమైన నగరాలు నంద్యాల, డోన్, ఆత్మకూరు తదితర నగరాలలో ముఖ్యమైన ప్లేస్లలో ప్రత్యేక నిగామించినట్లు తెలిపారు. గత వారంలో శ్రీశైలంలో డ్రోన్ కెమెరాల ద్వారా పేకాటరాయాలను అరెస్టు చేసినట్లు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, మైనర్లు డ్రైవింగ్ చేయడం వంటి వాటిపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించినట్లు తెలిపారు. పాములపాడు ప్రాంతంలో నేషనల్ హైవే పనులు జరుగుతున్నందున ట్రాఫిక్ సమస్యలు ఉన్నాయని వాటి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించినట్లు తెలిపారు. ప్రతి ప్రధాన సెంటర్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. బుధవారం కలెక్టర్ తో పాటు నేషనల్ హైవే సమస్యల పైన పర్యటించామని, ఆత్మకూరు పాములపాడు స్టేషన్ను తనిఖీ చేసినట్లు ఆయన తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యం

- నంద్యాల పార్లమెంటు నూతన కాంగ్రెస్ కమిటీ నియామకం
- ముస్లింలకు రాజ్యాంగం ఇచ్చిన స్వేచ్ఛను హరించడానికే వక్ఫ్ సవరణ బిల్లు
- డీసీసీ అధ్యక్షులు, ఏఐసీసీ మెంబెర్ జంగిటి లక్ష్మి నరసింహ యాదవ్

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల జిల్లాలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి బూత్ స్థాయి నుంచి నాయకులను నియమించుకొని క్షేత్రస్థాయి నుంచి పార్టీ బలోపేతం చేయడానికి, రాబోయే ఎన్నికల్లో రాహుల్ గాంధీని ప్రధాని చేసుకోవడానికి, షర్మిలను ముఖ్యమంత్రి చేసుకోవడానికి ప్రతి ఒక్క నాయకుడు కృషి చేయాలని నంద్యాల జిల్లా డిసిసి అధ్యక్షులు జంగిటి లక్ష్మి నరసింహయాదవ్ సలహా, సూచనల మేరకు నంద్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలరెడ్డి ప్రకటించిన్నట్లు లక్ష్మి నరసింహ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో కష్టపడే ప్రతి ఒక్కరినీ గుర్తించి ప్రాధాన్యత కలిపిస్తామని, పోరాటాల ద్వారానే నాయకత్వం బలోపేతమవుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంలో ప్రతి ఒక్కరూ కీలక పాత్ర పోషించాలని. రాజకీయాల్లో ఉన్న వారెవరైనా ప్రజల సంక్షేమమే ప్రథమ లక్ష్యంగా పని చేయాలని సూచించారు. ముస్లింలకు రాజ్యాంగం ఇచ్చిన స్వేచ్ఛను హరించడానికే వక్ఫ్ సవరణ బిల్లును తీసుకరావడం జరిగిందని, ముస్లింల మనోభావాలు దెబ్బతీయడానికి మోడీ అజెండాగా పెట్టుకున్నారని, మైనారిటీల ప్రయోజనాలను దెబ్బతీసే బిల్లుకు టీడీపీ, జనసేన మద్దతు ఇవ్వడం దారుణమని, అదేవిధంగా వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతు ఇవ్వాలని టిడిపి పార్టీ విప్ జారీచేయడంసరైన పద్ధతి కాదని ఈ బిల్లును కాంగ్రెస్ పార్టీ తీవ్రంగావ్యతిరేకిస్తుందని, కూటమి ప్రభుత్వం ప్రతి విషయంలోనూ అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకు రావడమే లక్ష్యంగా పని చేయాలనీ కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు.

రోడ్డును ఎలా రద్దు చేస్తారు..

విశాలాంధ్ర-హొళగుంద: స్థానిక ఎస్సీ కాలనీలో ఉపాధి నిధులతో మంజూరైన రోడ్డును ఎలా రద్దు చేస్తారని మండల జనసేన కన్వీనర్ వరాల వీరేష్ అధికారులను బుధవారం ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వంలో ఎస్సీ కాలనీకి సీసీ రోడ్డు రూ.5 లక్షల గ్రాంట్ మంజూరు అయిందని, అధికారులు మంజూరైనసీసీ రోడ్డును ఎస్సీ కాలనీలో వేయకుండా ఈబీసీ కాలనీలో వేసినారన్నారు. ఏఈ అయినా యమునప్ప ఇందుకు కారణమని ఆరోపించారు. ఇదేనా దళితుల యెడల చూపే వివక్షత అని ప్రశ్నించారు. తమకు శాంక్షన్ అయినా రోడ్డును వేరేచోట ఎందుకు వేశారని, ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు వేయాలి అని డిమాండ్ చేశారు. ఇప్పటికి అయినా అధికారులు స్పందించి ఎస్సీ కాలనీల్లో సీసీ రోడ్డు వేయాలని అధికారులను మండల జనసేన పార్టీ కోకన్వీనర్ వరాల వీరేష్ విజ్ఞప్తి చేశారు. ఏఈ యమునప్పను విచారించగా సీసీ రోడ్డు రద్దు చేయడంలో తన పాత్ర ఏమీ లేదని, మండలాభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నప్పుడు ఆరోపించడం తగద న్నారు. నిధులు సాధించుకొని వస్తే ఎస్సీ కాలనీలో కొత్త సీసీ రోడ్డు వేయిస్తామని అన్నారు. ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు మంజూరైన మాట వాస్త వమని, పాత సీసీ రోడ్డు మీద కొత్త సీసీ రోడ్లు వేస్తామంటే అధికారులు రోడ్డు రద్దు చేశారని తప్ప జిల్లా కలెక్టర్ ఆదేశాలను పాటించాల్సి వస్తుందని అన్నారు.

ఉచిత పాఠ్య పుస్తకాలు పంపిణీ

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: స్థానిక బి.క్యాంప్ ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నాగస్వామి నాయక్ ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ సెక్రటరీ వారి ఆదేశాల మేరకు ఉచిత పాఠ్య పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ ఘనంగా చేయడం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు అందించే ఉచిత పుస్తకాలను సద్వినియోగం చేసుకొని మంచి భవిష్యత్ తీర్చిదిద్దు కోవాలని అన్నారు. ఉచిత పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ప్రసన్నకుమార్, రామకృష్ణ, విజయశేఖర్, మల్లికార్జున, సారధి పటేల్, లక్ష్మి, గిరిజరాణి, సుజాత,మల్లేష్, కృష్ణ మోహన్, ఉల్గోజి రావు విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

విశాలాంధ్ర - చాగలమర్రి: పట్టణంలోని ఎస్టీ కాలనీలో రోడ్డు, మురికి కాలువ నిర్మాణానికి సర్పంచ్ తులసమ్మ, ఉప సర్పంచ్ సోహెల్‌లు భూమి పూజ చేసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ, ఇన్‌చార్జ్ ఈఓ తాహిర్ హుస్సేన్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ సంబంధించిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 15 లక్షలతో రోడ్డు, మురికి కాలువల నిర్మాణం చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అనూష, వార్డు సభ్యురాలు ఇండ్ల సుశీల, వైసీపీ నాయకులు మాబుసున్న, షబ్బీర్, బబ్లూ, టీడీపీ నాయకులు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరంతరంగా అనుభవ లక్ష్యాల సాధనకు కృషి

విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్: తమ వ్యాపార విస్తరణ పెంపొందించు కునేందుకు నిరంతర దుకాణ అనుభవ లక్ష్యాల సాధనకు కృషి చేస్తున్నామని అమెజాన్ ఫ్రెష్ ఇండియా డైరెక్టర్ శ్రీకాంత్ శ్రీరామ్ పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టియర్-2, 3 పట్టణ, నగరాలు అంతకుమించి చేరుకునేందుకు విస్తరించేందుకు మరింత అనుభూతిని ఇచ్చింద న్నారు. పోటీతత్వ ధరలు, కస్టమర్లు ఉన్నతమైన నాణ్యత ప్రమాణాలు కలిగిన కిరాణా సరుకులు పొందేలా, వారి ఇంటి వద్దకు సౌకర్యవంతంగా అందించడానికి అవకాశం కల్పిం చడం జరిగిందని చెప్పారు. చిత్తూరు, విజయవాడ వంటి ఎన్నో పట్ట ణాలకు తమ విస్తరణ ద్వారా కొత్త కస్టమర్లు అమెజాన్ ఫ్రెష్ విక్రతలు, బ్యాంకు భాగస్వాముల నుండి గొప్ప ఆదాలు, ఉత్తేజ భరితమైన డీల్స్‌ను అందిస్తూనే తమ వారపు, నెలవారి కిరాణా బాస్కెట్లను రూపొందించు కోవడం అని అర్థం. ఈ విస్తరణ అనేది దేశ వ్యాప్తంగా ఉన్న కస్టమర్ల కోసం ఆన్లైన్ కిరాణా షాపింగ్ అనుభవాన్ని పూర్తి మార్చడానికి తాము సిద్ధంగా ఉన్నామని శ్రీకాంత్ శ్రీరామ్ స్పష్టం చేశారు.

దివ్యాంగులను అగౌరపరచవద్దు

విశాలాంధ్ర - పెద్దకడబూరు: దివ్యాంగులను ఎవరూ అగౌరవపరచ కూడదని ఉపాధ్యాయులు నర్సింహులు అన్నారు. బుధవారం స్థానిక మండల ప్రాథమిక మెయిన్ పాఠశాలలో మండల విద్యాధికారులు సువర్ణల సునియం, రామ్మూర్తి ఆధ్వర్యంలో ప్రపంచ మూగవ్యాధి దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు ఎక్కడ ఉన్నా గౌరవించాలని, వారిలోని ఒంటరి తనాన్ని పోగొట్టి సమాజంలో ఉన్నతంగా చూడాలన్నారు. వారిని అడ్డపేర్లతో పిలవరాదని, వారి అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పాటును అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కేశవ, మల్లికా బేగం, సహిత, ఉపాధ్యాయులు ఎర్రకోట గోపాల్, సుబ్బారాయుడు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు టోపీలు పంపిణీ చేసిన మున్సిపల్ వైస్‌చైర్మన్

విశాలాంధ్ర - నందికొట్కూరు : పట్టణంలోని రబ్బాని కాంప్లెక్స్ నందు అల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం జర్నలిస్టులకు మున్సిపల్ వైస్ చైర్మన్ మొల్ల రబ్బాని టోపీలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులు ఎండనక వాననక వార్తలు కవరేజ్ నిమిత్తం ఆరోగ్యాన్ని కూడా లెక్క చేయకుండా జర్నలిస్ట్‌లు వెళుతుంటారని, ఈ వేసవికాలంలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండటం వలన జర్నలిస్టులు వడదెబ్బ తగలకుండా ఉండాలనే ఆలోచనతో ఆల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు టోపీలు పంపిణీ చేయడం చాలా శుభ పరిణామామన్నారు. అనంతరం ఆల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ నంద్యాల జిల్లా అధ్యక్షులు ఆనంద్ కుమార్ మాట్లాడుతూ అల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత మూడు సంవత్సరముల నుండి వేసవి కాలంలో జర్నలిస్టులకు వడదెబ్బ తగులకుండా ఉండాలని ఆలోచనతో జర్నలిస్టులకు టోపీలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అందులో భాగంగానే నందికొట్కూరు మున్సిపల్ వైస్ చైర్మన్ మొల్ల రబ్బానీ పంపిణీ చేయడం సంతోషకరమని, సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు సుబ్రహ్మణ్యం, జయరాజు, నాగన్న, గోపి, సుబ్బన్న, స్వాములు, శేషన్న, జంబులయ్య,స్వామన్న, రహంతుల్లా తదితర జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డలో ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. తాలుక టిడిపి నాయకులు భార్గవరామ్, భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా తన కార్యాలయంలో భారీ కేక్ ను కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు, అభిమానులకు తినిపించారు. అనంతరం ఎమ్మెల్యేకు బొకేలు అందజేసి, పూలమాలలు వేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సంత మార్కెట్ పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద గుండామని, గుండా శివయ్య మేనల్లుడు చక్రవర్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే అఖిల ప్రియ, భార్గవ్ రామ్ లు పాల్గొని ప్రజలకు అన్నం వడ్డించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ హుస్సేన్ భాష, అనంత రామ సుబ్బారెడ్డి, ఆళ్ల నాగ శ్రీనివాసులు, శివ యాదవ్ , సిరివెళ్ల మండల టిడిపి కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అహోబిలేసుని దర్శించుకున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ దంపతులు : ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలం లక్ష్మీ నరసింహ స్వామిని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, భార్గవరామ్ దంపతులు బుధవారం దర్శించుకుని పూజలు చేశారు. ఆలయానికి వారు చేరుకోగానే అర్చక బృందం ఆలయం మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం స్వయంభు నరసింహ స్వామి చెంచులక్ష్మి అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం అహోబిలంలోని వెలసిన మల్యాలమ్మను దర్శించుకుని పూజలు చేశారు. చెంచు కాలనీలో భూమా అఖిలప్రియ కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. అనంతరం చెంచు మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు సంజీవ రాయుడు పాల్గొన్నారు.

బ్రెడ్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

విశాలాంధ్ర - చాగలమర్రి : మండలంలోని వివిధ గ్రామాల్లో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ గారి జన్మదిన వేడుకలను టీడీపీ నాయకులు కార్యకర్తలు, భూమా అభిమానులు బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కేరళ ఆసుపత్రిలో టీడీపీ యూత్ లీడర్ కొలిమి సోను ఆధ్వర్యంలో టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు ఎంఎస్అన్సర్ బాష, జిల్లా మైనారిటీ నాయకులు కొలిమి హుస్సేన్ వల్లి రోగులకు బ్రెడ్లను పంపిణీ చేశారు. మండలంలోని నగళ్ళ పాడు గ్రామ సమీపంలో గల అనాథ వృద్ధ శరణాలయంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్థానిక పాత బస్టాండ్ లో కేక్ కోసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. టీడీపీ నాయకులు మౌలాలి, ముల్లా అజీమ్, జెట్టి నాగరాజు, హనీఫ్, టైలర్ ఖాదర్, హుస్సేన్,సదాఫ్, హుస్సేన్ పీరా, అర్షద్, సున్ని ,మా భాష, బారిక్ చామల్ మాబాష నాయకులు పాల్గొన్నారు.

ఉచిత మెడికల్ క్యాంపు ప్రారంభం

విశాలాంధ్ర - బనగానపల్లె : మండలంలోని నందవరం గ్రామంలో జరుగుతున్న శ్రీ చౌడేశ్వరి దేవి బ్రహ్మోత్సవాల సందర్భంగా బనగానపల్లె మెడికల్ అసోసియేషన్ వారు నిర్వహించిన ఉచిత మెడికల్ క్యాంపును, బొబ్బల రామచంద్రారెడ్డి నిర్వహించిన ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాలను రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి బీసీ ఇందిరా రెడ్డి ప్రారంభించారు. అనంతరం దేవస్థానానికి వచ్చిన భక్తులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. మజ్జిగ భక్తులకు పంపిణీ చేయడం జరిగింది. ఇలా అమ్మవారి సన్నిధిలో దాతలు సేవ చేయడం సంతోషంగా ఉదని, ఇలాగే మరిన్ని సేవ కార్యక్రమాలు చేయాలని కోరారు. జిల్లా తెలుగుదేశం పార్టీ వాణిజ్య విభాగం అధ్యక్షులు టంగుటూరు శ్రీనయ్య, మల్లారెడ్డి, బీసీ మదన్ భూపాల్ రెడ్డి, సురేంద్ర కుమార్ రెడ్డి,టీచర్ నాగరాజు, మెడికల్ పణీంద్ర, ఆనందు, శేఖర్, షఫీల్లా, మెడికల్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డ్ సవరణ బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలి : ఇన్సాఫ్

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు: మైనారిటీలను బీజేపీ ప్రభుత్వం మత ద్వేషాన్ని చిమ్ముతూ మతకలహాలు సృష్టిస్తుందని, కేంద్రా ప్రభుత్వం బుధవారం రోజున లోక్ సభలో ప్రవేశపెడుతున్న వక్ఫ్ బోర్డ్ సవరణ బిల్లు ఉపసంహరించుకోవాలని ఇన్సాఫ్ పట్టణ గౌరవ అధ్యక్షుడు కేసీ జబ్బర్, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు అజార్, సమీవుల్లా తెలిపారు. సీపీఐ కార్యాలయంలో ఇన్సాఫ్ పట్టణ సమితి సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ నరేంద్రమోడీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ముస్లిం మైనార్టీలకు తీవ్రమైన అన్యాయం చేస్తుందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వంలో కీలక పాత్ర పోషిస్తున్న రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ఈ సవరణ బిల్లును తక్షణమే ఉపసంహరించునే విధంగా కేంద్రంపై ఒత్తిడి తేవాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమావేశంలో ఇన్సాఫ్ నాయకులు దాదావలి, ఖాజా, ఇస్మాయిల్, రఫీక్, నభీసాబ్, టైలర్ ఖాజా, బాష, ఖాదర్, సమీర్ పాల్గొన్నారు.

ఎల్లార్తిలో ఘనంగా జరిగిన అడ్డపల్లకి మహోత్సవం

విశాలాంధ్ర-హొళగుంద: ఎల్లార్తిలో అక్క మహాదేవి ఉజ్జినయ్య స్వామి, లలితమ్మ నీలకంఠయ్య స్వామి, రుద్రముని స్వామి కుటుంబ సభ్యులు నిర్వహించిన సజ్జల గుడ్డదా శరణమ్మ పురాణ ప్రవచనం బుధవారం ముగియడంతో శ్రీశైలం 1008 పీఠాధిపతి జగద్గురు డాక్టర్ చెన్న సిద్ధ రామపండి తారాధ్య శివాచార్య మహా స్వాముల అడ్డపల్లెకి మహోత్సవం, పీఠాధిపతి తులాభారం ఘనంగా జరిగింది. పీఠాధిపతిచే ముత్తైదువులకు వడి బియ్యం నింపేకార్యక్రమాన్ని ప్రారంభించారు. పీఠాధిపతి అడ్డ పల్లకిని భక్తులు, ప్రజలు పురవీధుల గుండ సమేళ, మేళ తాళాలు, బీరప్ప డోల్లులతో, 101 ముత్తైదువుల కలశాలతో ఊరేగించారు. వీరశైవ లింగాయత్ యువకులు నినాదాలు ఇస్తూ అడ్డ పల్లకి ఊరేగింపులో పాల్గొన్నారు. శ్రీశైలం పీఠాధిపతి మాట్లాడుతూ పిల్లలను చదివించాలని ప్రపంచ శాంతి కోసం అందరూ పాటుపడాలని ఈ ఏడు వర్షాలు సమృద్ధిగా కురుస్తా యని ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆశీర్వదించారు. ప్రతి ఒక్కరూ దైవచింతనతో మెలగాలని తల్లిదండ్రులు, గురువులపట్ల గౌరవ భావంతో మెలగాలని ఉపదేశించారు. అన్ని ధర్మాల సారాంశం ఒక్కటే నే నని ప్రవచించారు. ఎల్లార్తిలో అడ్డ పల్లకి మహోత్సవం జరగడం గ్రామంతో పాటు దేశానికే గర్వకారణమని ప్రజలందరూ ఆయురారోగ్యంతో ఉండాలని ఉపదేశిం చారు. ధర్మం కట్టుబాట్లను పాటిస్తూ దూరాలవాట్లకు దూరంగా ఉండాలని కోరారు. అడ్డ పల్లకి మహోత్స వంలో జె.హొసల్లి పీఠాధిపతి శంభు లింగ స్వామి, పాల్తూరు పీఠాధిపతి చెన్న వీర స్వామి, రౌడ కుంద పీఠాధిపతి శివయోగి స్వామి, జంగమ స్వాములు తదితర గ్రామాల పీఠాధి పతులు, భక్తులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు. శ్రీశైలం పీఠాధిపతికి ప్రజలు భక్తి శ్రద్ధలతో నమస్కరించారు. స్వామివారు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

మహిళ ప్రాంగణాన్ని పరిశీలించిన జడ్జీ

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ నందు గల దిశ ఒన్ స్టాప్ కేంద్రం, మహిళా ప్రాంగణంను పరిశీలించిన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి బుధవారం ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ నందు గల దిశ ఒన్ స్టాప్ కేంద్రం, మహిళాప్రాంగణంను తనిఖీ చేశారు. కార్యాలయాలకు సంబందించిన రిజిస్టర్‌లను పరిశీలించి, సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అక్కడి సౌకర్యాలు, పరిశుభ్రతను పరిశీలించారు. ఈ సదస్సులో అక్కడ ఉన్న వారికి లీగల్ సర్వీసెస్ ఆక్ట్ 1987 ద్వారా ఉచిత న్యాయ సహాయంను పొందుటకు అర్హులని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబందిత అధికారులు పాల్గొనారు.

టీడీపీ అభివృద్ధికి కృషి

విశాలాంధ్ర-హొళగుంద: టీడీపీ అభివృద్ధికి అందరూ కృషి చేయాలని మండల టీడీపీ కన్వీనర్ డాక్టర్ తిప్పయ్య అన్నారు. వైసీపీ సీనియర్ నాయకుడు గజ్జహల్లి సిద్ధప్ప, మాజీ ఎంపీపీ మహాలింగమ్మతోపాటు వంద మంది వైసీపీ పార్టీని వీడి, ఆలూరు నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ వీరభద్ర గౌడ, టీడీపీ యువ నాయకుడు గిరి మల్లేష్ గౌడ ఆధ్వర్యంలో బుధవారం టిడిపి పార్టీలో చేరారు. వైసీపీ సీనియర్ నాయకులు గజ్జిహల్లి సిద్ధప్ప, నాయకులకు టిడిపి కండువను ఆలూరు నియోజకవర్గం టీడీపీ ఇంచార్జీ వీరభద్ర గౌడ వేసి, పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మండల టీడీపీ కన్వీనర్ డాక్టర్ తిప్పయ్య మాట్లాడుతూ వచ్చే స్థానిక సంస్థ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు ఘన విజయం సాధించడానికి ఇప్పటి నుండే కూటమి నాయకులు, కార్యకర్తలు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తోక వెంకటేష్, దిడ్డి తిక్క స్వామి, కూడ్లూరు వీరప్ప, ఎల్లార్తి మల్లికార్జున, అయ్యప్ప, పూజారి దేవన్న, బకాడి వీరేష్, బాగోడి రామ, సాయిబేష్, కన్నయ్య, చాకలి బద్రి, నంబర్ మల్లయ్యతదితరులు పాల్గొన్నారు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర - జూపాడుబంగ్లా : మండలంలోని నేటి నుండి రెండు రోజులపాటు ఆధార్ కేంద్రాలను నిరుస్తున్నట్లు ఎంపీడీవో గోపికృష్ణ తెలిపారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 3, 4న తుడిచెర్ల, 3న పారుమంచాల, 4న జూపాడుబంగ్లా గ్రామాల్లో ఉదయం 9నుండి సాయంత్రం ఐదు గంటల వరకు ఆధార్ క్యాంపులు ఆయా గ్రామాలలోని గ్రామ సచివాలయాల వద్ద నిర్వహిసున్నట్లు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

నేడు కంది, మినుము, శనగ పంటల కొనుగోలు కేంద్రాలు

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్: కంది, మినుము, శనగ పంటల కొనుగోలు కేంద్రాలు నేడు ప్రారంబిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి విష్ణు వర్ధన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆత్మకూరు అర్బన్ రైతు సేవ కేంద్రం నందు శ్రీశైలం నియోజకవర్గ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వం చేపడుతున్న ఏపీ మార్కుఫెడ్ ఆధ్వర్యంలో కనీస మద్దతు ధరకు కంది, మినుము, శనగ పంటల కొనుగోలు ప్రారంభోత్సవ కార్యక్రమం అర్బన్ రైతు సేవ కేంద్రం నందు 3వ తేదీ గురువారం 10:30 గంటలకు నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఒంగోలు జాతి ఎద్దుల పోటీలు

విశాలాంధ్ర - బనగానపల్లె: మండల పరిధిలోని టంగుటూరు పెద్దమ్మ తల్లి 16వ రోజు పండగను పెద్దమ్మ కమిటీ సభ్యులు గ్రామ రైతులు, ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దమ్మ తల్లి కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్యులు రోడ్లు భవనాలు మౌలిక సదుపాయాలు పెట్టుబడులు శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సోదరుడు పారిశ్రామికవేత్త బీసీ రామనాథ్ రెడ్డి టంగుటూరు పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి తదనంతరం అఖిల భారత ఒంగోలు జాతి వృషభ రాజములను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టంగుటూరు గ్రామ పెద్దలు నాయకులు లక్ష్మం కాంత్ రెడ్డి, ప్రవీణ్ కుమార్ రెడ్డి, ధనుంజయ రెడ్డి, రంగస్వామి రెడ్డి, గాలి రామిరెడ్డి, కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

రూ.65 లక్షల మినరల్ వాటర్ ప్లాంట్లు వితరణ

విశాలాంధ్ర - బనగానపల్లె : బనగానపల్లె పట్టణంలోని ఆయా ప్రార్థనా మందిరాలకు వచ్చే భక్తుల దాహార్తి తీర్చడం కోసం ఉచిత కూలింగ్ మినరల్ వాటర్ ప్లాంట్స్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నట్లు బనగానపల్లి పట్టణ మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి తెలిపారు. బనగానపల్లె పట్టణంలో 48 పెద్ద, మధ్య, చిన్న ప్రార్థన మందిరాలు ఉన్నాయని, ఆయా ప్రార్థన మందిరాలకు సంబంధించి కొంతమంది తనను సంప్రదించి తాగునీటికి ఇబ్బంది ఉందని మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని కోరడం జరిగిందన్నారు. ఈ మేరకు తల్లిదండ్రులు కీర్తిశేషులు బిసి గుర్రెడ్డి, బిసి లక్ష్మమ్మ దంపతుల జ్ఞాపకార్థం ఉచితంగా సుమారు రూ.65 లక్షల విలువగల మినరల్ వాటర్ ప్లాంట్స్ ఏర్పాటు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. బీసీ కాలనీ మాసుమ్ బాష ఖాద్రీ మసీదు పేష్ మామ్ ఇస్మాయిల్ మియా, మదర్ థెరిస్సా చర్చి ఫాదర్ బాబురాజ్, ఆంజ నేయ స్వామి దేవస్థానం పూజారి పి.ఆనంద ప్రసాద్ శర్మ పాల్గొన్నారు.

బీఎల్‌వోలు నిబద్ధతతో పని చేయాలి

విశాలాంధ్ర - కర్నూలు సీటీ : ఎన్నికల విధులను నిబద్ధతతో పని చేయాలని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు బీఎల్‌వోలకు సూచించారు. బుధవారం స్థానిక ఎస్బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో బీఎల్‌వోలకు వార్షిక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ ఫాం 6, 7, 8 లను నింపటంపై పూర్తి అవగాహనతో ఉండాలని, పోలింగ్ కేంద్రాల వద్ద సౌకర్యాలు అవసరమనుకుంటే తమ దృష్టికి తీసుకొని రావాలన్నారు. హ్యాండ్ బుక్‌ను చదివి ఎన్నికల విధులు, నిబంధనలు, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని బీఎల్వోకు కమిషనర్ సూచిం చారు. కార్యక్రమంలో ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, తహ శీల్దార్ వెంకటలక్ష్మి, సూపరింటెండెంట్లు మన్సూరు బాష, క్రిస్టోఫర్, డిప్యూటీ తహశీల్దార్ ధనుంజయ, ఆర్ఐలు భార్గవ్, రాజు పాల్గొన్నారు.